కమనీయం.. రమణీయం.. సత్యదేవుడి కల్యాణం..

అన్నవరం సత్యదేవుడి కల్యాణం కమనీయంగా.. రమణీయంగా సాగింది. రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మి దివ్య కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. అన్నవరంలో భారీ వేదికపై ఈ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తజనం హాజరయ్యారు. ఈ పెళ్లికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా వారిని పక్కనే మరో వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో ఆ ప్రాంతమంతా కల్యాణ శోభతో నిండింది. దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, కలెక్టర్ నివాస్ పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. రాత్రి 10.30 గంటల తర్వాత అమ్మవారి మెడలో స్వామివారు మూడుముళ్లు వేశారు. ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ వేడుక కలిగించారు. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి,అమ్మవార్లు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. వివరాలు 7లో..

కల్యాణం వేళ కాంతులీనుతున్న రత్నగిరి



సత్యదేవుడి కల్యాణం సమయంలో విద్యుద్దీపాలతో కళకళలాడుతున్న ఆలయ ప్రాంగణం విహంగ వీక్షణం



కల్యాణం అనంతరం కర్పూర దండలతో సత్యదేవుడు, అనంతలక్ష్మి దంపతులు



పట్టువస్త్రాలతో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ నివాస్, ఈవో రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్ తదితరులు



భవితను తేల్చేది.. యువతేనా?

- వైసీపీ అభ్యర్థుల అంతర్మథనం
- కూటమి పథకాలపై ఆందోళన
- అధికారపార్టీలో నైరాశ్యం

సామర్లకోట, మే 19: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి అధికార వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పోలింగ్‌కు ముందురోజు వరకూ మళ్లీ మేమే అధికారంలోకి వస్తామనే ఆశల పల్లకిలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత గెలుపోటములపై ఆ పార్టీ అభ్యర్థుల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడుతో ప్రతిఇంటికీ లబ్ధి చేకూర్చామని గొప్పలు పోయిన ఆ పార్టీ అభ్యర్థులు అభివృద్ధిని మరిచాం కదా అని ఇప్పుడు గుర్తిస్తున్నారు. పింఛన్‌దారులు, మహిళలు తమకే ఓటు వేసుంటారనే నమ్మకంతో ఉన్న వైసీపీ అభ్యర్థులకు యువ ఓటర్ల నిర్ణయంపై గుబులు రేపుతోంది. యువత ఎటువైపు ఉన్నారనే అంతర్మథనంలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో యువత ఓట్లశాతం ఎంత ఉంటుందనే లెక్కలు వేసుకుంటున్నారు. ఐదేళ్ల పాలనలో యువతకు ప్రత్యేకంగా ప్రయోజనాలు చేకూర్చింది లేదు కదా అనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో యువత ఓటు ఎటువైపు అనే సందిగ్ధం వారిని వెంటాడుతోంది. చివరికి గెలుపోటములపై ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుందనే నైరాశ్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పథకాలపై యువతలో ఆశలు

టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో యువతకు ఏడాదికి 4లక్షలమంది చొప్పున ఐదేళ్లకు 20లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రతిఏటా జాబ్ క్యాలండర్ విడుదల చేయడంతోపాటు యువతకు ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగభృతి అందజేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ప్రతి సభలోనూ స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత విభజిత రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత కరువు జిల్లాల్లో కియా కార్ల పరిశ్రమ తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. మరీ ముఖ్యంగా కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తామని చంద్రబాబు స్పష్టమైన హామీఇవ్వడంతో యువతలో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం వైసీపీ అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ గెలుపోటములపై యువత ప్రభావం తప్పనిసరిగా పడుతుందన్న అభద్రతాభావం వైసీపీ అభ్యర్థులను వెంటాడుతోంది.

అధినేత నియంతృత్వ పాలనపైనా విసుర్లు

రాజశేఖరరెడ్డి బిడ్డగా ఆయన కంటే మెరుగైన పాలన అందిస్తానని ఒక్క ఛాన్స్ ఇవ్వాలని వైఎస్ జగన్ పాదయాత్రలోను, గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోను ప్రజలను అభ్యర్థించారు. అన్నివర్గాల ప్రజలు జగన్ మాటలు నమ్మి తిరుగులేని మెజార్టీతో అధికారాన్ని కట్టబెట్టారు. ప్రజల సంక్షేమంతోపాటు అభివృద్ధిని సమపాళ్లల్లో చూడాల్సిన ముఖ్యమంత్రి జగన్ నియంతృత్వ పాలన సాగించారని పోలింగ్ తర్వాత ఆ పార్టీ అభ్యర్థుల్లో విసుర్లు మొదలయ్యాయి. ఎన్టీఆర్ కాలం నుంచీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనుకుంటే పొరబడినట్లేనన్న భావన ఆపార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మేనిఫెస్టో రూప కల్పనలోను కూటమి మేనిఫెస్టోతో పోలిస్తే వైసీపీ మేనిఫెస్టో ప్రజల్లో భరోసా నింపలేదన్న వాదన ఆ పార్టీలోనే ఉంది. సంక్షేమ పథకాల ద్వారా ఫలానా ఇంటికి ఇంత మొత్తంలో లబ్ధి చేకూర్చామని ఇంటింటికీ వెళ్లి చెబుతున్నామేగానీ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొచ్చారా, ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా, ప్రాజెక్టులు పూర్తి చేసి ఒక ఎకరానికైనా సాగు నీరిచ్చారా అనే ప్రశ్నలకు ఆపార్టీ అభ్యర్థులు సమాధానం ఇచ్చుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నామని ఆవేదన వారిలో ఉంది. ఈ పరిణామాలే తమను దెబ్బతీస్తాయని ఆందోళన చెందుతున్నారు.

యువత ఓట్లపై గుబులు

యువత ఓటుశాతం పెరగడంపై అధికార వైసీపీ అభ్యర్థుల్లో యువ ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా ఉదయం 7 గంటలకు ముందే యువత ఓటు వేసేందుకు బారులు తీరిన విషయం తెలిసిందే. ఇదే అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 47.81 లక్షల ఓటర్లు ఉండగా వారిలో యువత ఓటర్లు 9.31 లక్షల మంది ఉన్నారు. వారిలో తొలిసారి ఓటుహక్కు పొంది 18ఏళ్ల వయస్సు వారు కాకినాడ జిల్లాలోనే 52వేలమంది ఉన్నారు. యువ ఓటర్లు దాదాపు 65శాతంపైబడి ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ విధులకు హాజరైన ఉద్యోగ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ యువ ఓటింగ్ శాతమే వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రాజేస్తోంది. ప్రతి నియోజకవర్గంలోను 25వేల నుంచి 35వేల మందికి పైగానే యువ ఓటర్లు ఉండడం వైసీపీ అభ్యర్థులకు కంటకంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఎన్నికలరోజున సాయంత్రం 6గంటల తర్వాత క్యూలో ఉన్న యువ ఓటర్లు

అరకొరగానే విడుదల



- రైతుల ఖాతాలకు చేరిన ఇన్‌పుట్ సబ్సిడీ
- పరిహారం కొందరికే పడడంతో తమకు వస్తాయా రావా అని మిగిలిన వారిలో సందేహాలు
- పంటనష్టం నమోదు నుంచీ రైతాంగానికి అన్యాయమే

పిఠాపురం, మే 19: ఏ సీజన్‌లో నష్టపోయిన పంటకు అదే సీజన్‌లో నష్టపరిహారం అందిస్తామన్న వైసీపీ ప్రభుత్వం రెండుసీజన్లు ముగిసిన తర్వాత ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల చేసింది. అదీ అరకొరగానే. ఎన్నో అవాంతరాలు, మాట తిప్పుడులు తర్వాత రైతులకు ఖాతాలు చేరడం ప్రారంభించాయి. సగంమందికి పరిహారం సొమ్ములు ఖాతాలకు జమకాకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గతేడాది డిసెంబరు నెలలో ఈదురుగాలులతో కురిసిన అతి భారీవర్షాలు జిల్లా రైతుల వెన్నువిరిచాయి. సార్వాపరిసాగు చేసిన పొలాల్లో ఉండిపోయిన వరిపనలు, కుప్పలు నీటిలో నానగా పలు చోట్ల ధాన్యం రాశులు తడిచిపోవడంతోపాటు కొట్టుకుపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలనంటింది. అప్పట్లో నష్టం అంచనాల నమోదును ఆలస్యంగా ప్రారంభించడంపై విమర్శలు వచ్చాయి. అప్పటికే వర్షాలకు తడిచిన ధాన్యం రాశులు, దెబ్బతిన్న వరిపంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. నేలనంటిన వరిపంటను కోసి కొన్ని చోట్ల మాసూళ్లు పూర్తిచేశారు. ఇటువంటి వాటిని నమోదు చేసేందుకు పలు చోట్ల బృందాలు అంగీకరించకపోవడం, వరికుప్పలు, ధాన్యం రాశులు వారం రోజులకు పైగా నీటిలో నానినా నిబంధనల పేరుతో వాటిని నమోదు చేయకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.

అంచనాల నమోదులోనే అన్యాయం

పంటనష్టాల నమోదు ఆలస్యంగా ప్రారంభం కావడం, నిబంధనల పేరిట పలుచోట్ల నష్టాలను నమోదు చేయకపోవడంతో రైతులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. 29వేల హెక్టార్లల్లో వరిపంటకు నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేయగా అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు పరిశీలన, నష్టాల నమోదు, ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన తర్వాత జిల్లాలో 12,006.07హెక్టార్లల్లో వరి, పత్తి, అపరాలు, మొక్కజొన్న తదితర వ్యవసాయ పంటలకు మాత్రమే నష్టం జరిగిందని నిర్ధారించారు. దీనికిగాను 27,980మంది రైతులకు రూ.21.98కోట్లు పరిహారంగా చెల్లించాలని, 533.89 హెక్టార్లల్లో ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికిగాను 1750మంది రైతులకు రూ.1.07కోట్లు పరిహారంగా చెల్లించాలని అప్పట్లో నివేదించారు. ప్రాథమిక అంచనాలు కంటే తుది అంచనాలు అధికంగా ఉంటాయి. ఇక్కడ మాత్రం రివర్స్‌లో ప్రాథమిక అంచనాల్లో సగం కూడా నష్టం జరిగినట్లు ప్రత్యేక బృందాలు అంచనా వేయకపోవడంపై అప్పట్లో రైతుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి.

ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో అంటే ఇదేనా?

ఏ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) విడుదల చేస్తున్నామని సీఎం గొప్పలు చెప్పేవారు. మిచౌంగ్ తుఫాన్‌వల్ల సార్వా సీజన్‌లో నష్టం జరగడంతో ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందించాలి. సంక్రాంతికి నిధులు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ విషయం మరిచిపోయింది. ఎట్టకేలకు మార్చి 6న సీఎం జగన్ బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు ప్రకటించారు. రబీ సీజన్ ముగిసింది. పోలింగ్ తర్వాత వీటి మాటే మరిచిపోవడంతో టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్, రాష్ట్ర గవర్నర్‌లకు లేఖ రాయడంతో కదలిక వచ్చింది. శనివారం నిధులు విడుదల చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

అరకొరగానే..

ఆదివారం తెల్లవారుజామునుంచి మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు వారి ఖాతాల్లో పడడం ప్రారంభమైంది. సాయంత్రానికి సగంమంది రైతులకు కూడా పడలేదు. నష్టపరిహారం అరకొరగానే పడింది. మూడు, నాలుగు ఎకరాలున్న రైతులకు అందులో కేవలం 50శాతంలోపుగా నష్టం జరిగినట్లు పరిహారం విడుదలైంది. ఇప్పుడు పరిహారం అందరి రైతులకు పడకపోవడంతో సరికొత్త సందేహాలు మొదలయ్యాయి. 30-40శాతం మంది రైతులకు మాత్రమే నిధులు పడ్డాయి. మిగిలిన వారికి డబ్బులు పడతాయా, లేదా అన్న చర్చగా సాగుతోంది.

సాగునీరందించండి సారూ!



నీరు లేక ఎండిపోయిన పుష్కర కాలువ

- తొలకరి పంటలకు సాగునీరు లేదని రైతుల ఆవేదన

జగ్గంపేట, మే 19: తమపై కరుణ చూపాలని మెట్ట రైతులు గగ్గోలు పెడుతున్నారు. మెట్టప్రాంతమైన జగ్గంపేటలో ఎత్తిపోతల పథకం ద్వారా వేలాది ఎకరాలను వరి పంటతోపాటు ఇతర పంటలు పండించుకుంటూ రైతాంగం జీవనోపాధి సాగిస్తోంది. గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి అందించడంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో గోదావరి నుంచి పుష్కర జలాలను మెట్టప్రాంతానికి తీసుకొచ్చారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌లో మోటార్లు, పైపులైన్లు పూర్తిగా పాడయ్యాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో వీటి నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో 2023-24 సంవత్సర కాలంలో చేతికొచ్చే సమయానికి నీరందక పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. సార్వా పంటలు ఎండిపోయిన తరుణంలో దాళ్వా పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధం కాలేకపోతున్నారు. కోట్లాది రూపాయిలు వెచ్చించి ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీటిని మెట్ట ప్రాంతానికి అందించడానికి టీడీపీ ప్రభుత్వం అనేక కష్టాలు పడి ప్రాజెక్టులను తీసుకొస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలోకి తొక్కింది. ప్రస్తుతం మే నెల గడుస్తుండగా జూన్ నెలలో వరి వ్యవసాయ సాగుతోపాటు ఇతర పంటలు వేసుకోవడానికి సాగునీరు ఈ ప్రాంతానికి అత్యవసరమైనా అధికారులు స్పందించడంలేదు. మరోపక్క ఎండల ధాటికి చెరువులు కూడా అడుగంటిపోయాయి. రాజపూడి లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి సీతారాంపురం, రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం, కాండ్రేగుల, గొల్లలగుంట, గుర్రప్పాలెం, జగ్గంపేట ప్రాంతాలకు సాగునీరు అందాలంటే సీతారంపురంలో పాడైన పైపులైన్ పూర్తిగా బాగుచేయాలి. తాళ్లూరు ప్రధాన లిఫ్ట్‌లో మరమ్మతులకు గురైన మోటార్లను సరిచేయాలని రైతాంగం కోరుతోంది. రెండునెలలుగా ఎన్నికల హడావిడిలో ఉన్న అధికారులు ఇప్పటికీ స్పందించకుండా వ్యవసాయ సీజన్ ఆరంభమవుతున్నా కనీసం పట్టించుకోకుండా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. వర్షాలు పూర్తిస్థాయిలో పడతాయని వార్తలొస్తున్నా పుష్కర నీరందకపోతే మాత్రం పంటలు పండే గ్యారంటీ లేదని రైతులు వాపోతున్నారు. తక్షణం కలెక్టర్ స్పందించి ప్రత్యేక నిధులు విడుదల చేసి పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు చేపట్టి నీరందించాలని మెట్టరైతులు కోరుతున్నారు.

వాహనాలకు మాత్రమే పెట్రోల్ సరఫరా చేయాలి

- కంటైనర్స్, బాటిల్స్, డ్రమ్‌ల్లో నింపొద్దు
- కలెక్టర్ జె.నివాస్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), మే 19: ఎన్నికల నియమావళిని అనుసరించి జిల్లాలో పెట్రోలు బంకుల యాజమాన్యం పెట్రోల్, డీజిల్‌ను వాహనాలకు మాత్రమే సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్‌ను కంటైనర్స్, బాటిల్స్, డ్రమ్స్ ద్వారా సరఫరా చేయవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే పెట్రోల్ బంకుల లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. జూన్ 10వ తేదీవరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు.

మామిడి పండ్ల ధర.. అధరహో



- తగ్గిన దిగుబడులతో పెరిగిన ధరలు
- ఇతర రాష్ట్రాలకు పెరిగిన ఎగుమతుల జోరు

ప్రత్తిపాడు, మే 19: మధురఫలం మామిడి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏటా మే నెల సీజన్‌లో అధికంగా దిగుబడికి వచ్చే మామిడి పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. మామిడి దిగుబడులు తగ్గడం, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవ్వడం వంటి కారణాలవల్ల మామిడి ధరలు విపరీతంగా పెరిగాయి.

జిల్లాలో ప్రత్తిపాడు, తుని, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో మామిడితోటలు విస్తారంగా వ్యాపించి ఉన్నాయి. 15వేల ఎకరాల్లో మామిడితోటలను రైతులు సాగుచేస్తున్నారు. అత్యధికంగా భంగినపల్లి, చెరుకురసం, కొత్తపల్లి కొబ్బరి, పాపారావుగోవా, నీలం, సువర్ణరేఖ, కలక్టర్, పండూరి మామిడివంటి రకాలను మామిడి రైతులు జిల్లాలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి తోటలకు సకాలంలో నీరు అందని పరిస్థితి ఏర్పడడంతో దిగుబడి తగ్గింది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, చీడపీడల వంటి ప్రభావాలు దిగుబడిపై ప్రభావం చూపాయి. దీంతో అరకొర నీటి సదుపాయం ఉన్న చోట మామిడి దిగుబడులు రాగా నీటి సంరక్షణ లేని ప్రాంతాల్లో మామిడి దిగుబడి దారుణంగా పడిపోయింది.

● తగ్గిన దిగుబడులు, పెరిగిన ఎగుమతులు

జిల్లాలో మామిడి దిగుబడులు తగ్గడం, జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు పెరగడంతో మామిడి ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. గతేడాది భంగినపల్లి మామిడిపండ్ల ధర 1000కాయలు రూ.20వేల వరకు ఉండగా ఈ ఏడాది 1000 కాయలు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు చేరింది. చెరుకు రసం గతేడాది 1000కాయలు రూ.25 వేలు ఉండగా ఈ ఏడాది 1000 కాయలు రూ.35వేల నుంచి రూ.40వేలకు చేరింది. పాపారావు గోవ గతేడాది 1000కాయలు రూ.10వేలు ఉండగా ఈ ఏడాది రూ.20వేలు పైబడి ఉంది. కొత్తపల్లి కొబ్బరి రూ.5వేలు పలకగా ఈ ఏడాది రూ.7వేల వరకు చేరింది. దీనికితోడు జిల్లా నుంచి గతేడాది మామిడి ఎగుమతులు తగ్గిపోవడంవల్ల మామిడి ధరలు అంతగా పెరగలేదు. ఈ ఏడాది మామిడి ఎగుమతులు జిల్లా నుంచి ఢిల్లీ, ఖరగ్‌పూర్, కటక్, భువనేశ్వర్, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాలకు రైతులు అత్యధికంగా ఎగుమతులు చేస్తున్నారు. దీనివల్ల మామిడి స్థానిక మార్కెట్‌ల్లో ధరలు గణనీయంగా పెంపుదల చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రత్తిపాడు మార్కెట్‌లో పరక(14కాయలు)భంగినపల్లి రూ.400వరకు ఉండగా, చెరుకు రసం పరక రూ.400 నుంచి రూ.500 వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో మధురఫలం మామిడిని తినేందుకు ఎంతో ఆసక్తిగా మార్కెట్‌లో వచ్చి కొనుగోలుకు సిద్ధమైనా మామిడిప్రియులకు ధరలు షాక్ కొట్టేలా ఉండడంతో అవాక్కవుతున్నారు.



● మామిడిపై చీడపీడలు

ఈ ఏడాది మామిడికి చీడపీడలు ఉధృతంగా ఆశించాయి. వర్షాభావ పరిస్థితులు, ప్రతికూల వాతావరణం వంటి వాటివల్ల తేనెమంచు, నల్లిపురుగులు ఉధృతంగా వ్యాప్తి చెందాయి. వీటిని నివారించేందుకు రైతులు ఐదారుసార్లు పురుగుల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడడం కొన్నిచెట్లు కాయల ఎదుగుదల లేకపోవడం వంటి వాటివల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని మామిడి రైతులు వాపోయారు. దీనికితోడు మెట్ట ప్రాంతంలో మామిడి తోటలను లీజులకు తీసుకుని సీజనల్ వ్యాపారం చేసే మామిడి రైతులు కూడా కాయ ఎదుగుదల, చీడపీడలు వ్యాప్తి చెందడంవల్ల నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. లక్షలాది రూపాయలు కౌలుగా చెల్లించి తోటను తీసుకున్నా ఆశించిన మేర మామిడి దిగుబడులు లేవని కౌలు మామిడి రైతులు వాపోతున్నారు. మెట్ట ప్రాంతంలో మామిడి మార్కెట్‌లకు సరైన వసతులు లేకపోవడంవల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రత్తిపాడు మామిడి మార్కెట్‌కు వచ్చే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట గ్రామాల నుంచి ప్రత్తిపాడు మార్కెట్‌కు నిత్యం మామిడిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. చెక్‌పోస్టు సెంటర్ మామిడి విక్రయకేంద్రంవద్ద కనీస సదుపాయాలు లేవని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● దిగుబడులు తగ్గినా ఎగుమతులు అధికం

గొనగాల గోపాలస్వామి, మామిడి రైతు, ధర్మవరం

రెండేళ్లుగా మామిడి ఎగుమతులు ఇతర రాష్ట్రాలకు లేకపోవడంవల్ల స్థానికంగానే మామిడిని అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ఒడిశా, ఉత్తరాఖండ్, తెలంగాణా, ఢిల్లీ వంటి ప్రాంతాలనుంచి ఆర్డర్‌లు ఉండడంతో మామిడిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతికి అవకాశాలు ఏర్పడ్డాయి. దిగుబడులు తగ్గినా ఎగుమతులు ఉండడంవల్ల ధరలు పెరిగి కాస్త మామిడి రైతులకు ఊరట కలిగింది.



కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న పండితులు



తలంబ్రాల వేడుక

స్వామి, అమ్మవారి దివ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం





కల్యాణ వైభోగమే..

కనుల పండువగా సత్యదేవుని దివ్య కల్యాణం

భువనమోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం ఆదివారం రాత్రి రత్నగిరిపై అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంత రహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకరించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్ప పరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా శోభిల్లింది.

కమనీయంగా వేడుక

శోభాయమానంగా మారిన రత్నగిరి

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



సాంస్కృతిక కార్యక్రమాలు





పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న చైర్మన్, ఈవో



అన్నవరం, మే 19: కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామికల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. చైర్మన్ ఐ.వి రోహిత్ దంపతులు పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి 7 గంటలకు బాజాభజంత్రీలు, వేదమంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సత్యదేవుడిని వెండిగరుడ వాహనంపైన అనంతలక్ష్మి అమ్మవారిని వెండి గజవాహనంపై గ్రామోత్సవం జరుపుకుని కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. సర్వశిల్పకళా శోభితమైన, వివిధ పరిమళ పుష్పాలతో విద్యుద్దీప అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ఈ వివాహ కార్యక్రమానికి సీతారాములు పెండ్లి పెద్దలుగా వ్యవహరించడంతో మరో వేదికపై వారిని ఆశీనులు గావించి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం కన్యావరుణలు జరిపి అమ్మవారితో మంగళగౌరీపూజను జరిపించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాన్ని వివరించే ప్రవరను వేదపండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్రజలంతో కడిగి పాద ప్రక్షాళన కార్యక్రమం మధుపర్క ప్రాశన జరిపి మధుపర్కాలను స్వామికి ధరింపచేశారు. చతుర్వేద పండితులు దేశకాలమాన పరిస్థితులు వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికమంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామస్మరణ మధ్య మాంగల్యం తంతునా నేనా లోకరక్షణ హేతునా అంటూ స్వామి, అమ్మవారి మెడలో మూడుముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు వేడుక కలిగించారు. పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్ల దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు.

కల్యాణ తంతును వీక్షిస్తున్న అధికారులు



ఈ కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా వేడుకలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐ.వి రోహిత్ పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం 8 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కలెక్టర్ నివాస్ కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో 150 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సాత్విక్‌సాయిరాజ్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, మే 19: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 డబుల్స్ ఫైనల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ విజయం సాధించింది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ జోడీకి పలువురు అభినందనలు తెలిపారు. సాత్విక్‌సాయిరాజ్ విజయ యాత్రలో మరో కప్ వచ్చి చేరిందని అభినందించారు. సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జంటకు ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ కుడుపూడి సూర్యనారాయణరావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి గోకరకొండ నాగేంద్ర, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

సర్టిఫికెట్లు ఎప్పుడిస్తారో..?

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు పాట్లు

నూతన విద్యాసంవత్సరం ఆరంభంలో ఇబ్బందులు

ఎన్నికల విధులతో ఆగిన సర్టిఫికెట్ల జారీ

పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, మే 19 : ఉన్నత విద్యకు అర్హత సాధించిన విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో చాలా జాప్యం జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమలు ప్రారంభం నుంచి రెవెన్యూ శాఖ నుంచి జారీ కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు రాక విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో దాదాపు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు వేచి చూస్తున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయినా వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల అవసరం పెరిగింది. నూటికి 90 శాతం విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చదువుకునేందుకు ఉత్సాహం చూపు తున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 80 శాతం పైబడి అడ్మిషన్లు అయిపోయాయి. ఆయా కాలేజీల్లో చేరేందుకు కుల, ఆదాయ , నివాస ధ్రువీకరణ పత్రాల అవసరం ఉంటుంది. దీంతో ఇప్పటికే విద్యార్థులు మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధికారులు అందరు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఐదు రోజులు కావడంతో దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయాలకు వెళుతుంటే ఇంకా పూర్తి కాలేదనే సమాధానం వస్తోంది. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు 16 రోజుల గడువు ఉన్నప్పటికి సర్టిఫికెట్స్ జారీలో జాప్యం తప్పడం లేదు. ఒక పక్క రోజులు గడుస్తున్నాయి.. కాలేజీల అడ్మిషన్లు వేగంగా అయిపోతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి , కలెక్టర్ డాక్టర్ మాధవీలత వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మే 19: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీకి చెందిన కల్లి పూర్ణ సాయికార్తీక్ (21) తన స్నేహితులు కరగాని గణేష్, కురందాసు దుర్గలతో కలిసి బైక్‌పై కొవ్వూరు నుంచి దొమ్మేరు వైపు వెళ్తుండగా నందమూరు జగనన్న కాలనీ, కాపవరం గ్రామాల మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే సర్వీస్ రోడ్‌లో అరటికాయల లోడ్‌తో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గణేష్, దుర్గలకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి



ఆత్రేయపురం, మే 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన గోదావరిలో స్నానం చేస్తూ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శాంతినగర్‌కు చెందిన దడాల దినేష్ (15) ఆదివారం తన మిత్రులతో కలిసి బ్యారేజీ వద్దకు స్నానానికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో బ్యారేజీ దిగువకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్రేయపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కారు అద్దాలు పగలకొట్టి బంగారం చోరీ



కొత్తపల్లి, మే 19: సాయంత్రం పూట చల్లగాలులను ఆస్వాదించేందుకు ఉప్పాడ బీచ్‌కు వచ్చిన పర్యాటకుల బంగారు అభరణాలు, నగదును దొంగిలించిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 12వ తేదీ సాయంత్రం కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన కె.శంకర్ తన కారులో కుటుంబసభ్యులతో ఉప్పాడ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసేందుకు కుటుంబసభ్యుల బంగారు ఆభరణాలు బ్యాగ్‌లో పెట్టి కార్‌ను ఒక పక్కగా పార్క్ చేశారు. స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యేందుకు కార్ దగ్గరకు రాగానే అప్పటికే కార్ వెనుక డోర్ అద్దం పగిలి ఉండడాన్ని గమనించిన శంకర్ లోపల బంగారు ఆభరణాలు జాగ్రత్త చేసిన బ్యాగ్ కనిపించకపోవడం, దానిలో ఉన్న సుమారు రూ 2.50లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ 3 వేల నగదు, సెల్‌ఫోన్‌లు, క్రెడిట్‌కార్డులు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే అక్కడ చుట్టుపక్కల వారిని ఆరా తీయగా ఎవరికీ తెలియదని చెప్పడంతో శంకర్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు బీచ్‌రోడ్డులో విచారణ చేపట్టారు.

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

సర్పవరం జంక్షన్, మే 19 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వందలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి వార్షిక దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి వైశాఖమాసం శుద్ధ ఏకాదశి విశేష పర్వదినంలో భావనారాయణస్వామి కల్యాణాన్ని పూర్తి సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చరణలతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నిత్య పూజ హోమం, బలిహరణ సేవాకాల కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పెద శేష వాహనంపై తిరువీధి ఉత్సవం ఘనంగా జరిపారు. దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో ఎదురు సన్నాహ కార్యక్రమం పూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. తలంబ్రాలు పోసుకునే దృశ్యాన్ని ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కల్యాణాన్ని స్వయంగా వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జె. భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



రావులపాలెం, మే 19: రావులపాలెం గౌతమి గోదావరిలో శనివారం సరదాగా ఈత కోసం దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమైన విష యం విదితమే. మూడో యువకుడైన సత్తి సంపతరెడ్డి (17) కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం తాతపూడి ఇసుక ర్యాంపు సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రత్తిపాడు, మే 19: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్థానిక నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రహదారిపై వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. టీషర్ట్, జీన్ ఫ్యాంట్ శరీరంపై ఉంది. యువకుడు తెలుపు రంగుతో ఐదున్నర అడుగుల పొడవు ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీకి నష్టం చేస్తే క్షమించేదిలేదు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

ప్రత్తిపాడు, మే19: టీడీపీలో ఉంటూ పార్టీకే నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించే వారు ఎంతటి వారైనా పార్టీ ఉపేక్షించదని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రత్తిపాడు మండలం టీడీపీ నాయకులు ఆదివారం తేటగుంట తరలివెళ్లి మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును కలిశారు. టీడీపీలో ఉంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పనిచేసిన మురళీరాజును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, పార్టీ సభ్యత్వం రద్దు చేయించాలని టీడీపీ నాయకులు కోరారు. దీనికి మాజీ మంత్రి యనమల స్పందిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎవరైనా పార్టీ చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండల పార్టీ నాయకులు అమరాది వెంకట్రావు, పల్లా గోపి, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, గొంతిన సురేష్, జింకల తాతారావు, మంతెన శ్రీను, లొండా లోవరాజు, రేమాల అప్పలరాజు, సింగిలి వెంకటేష్, తటవర్తి సుబ్బారావు, ఇళ్ల అప్పారావు, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, చిలకమర్తి వీరభద్రం, పుణ్యమంతుల శ్రీను పాల్గొన్నారు.

మహిళ మృతదేహం కలకలం



తుని రూరల్, మే 19: 16వ నెంబరు జాతీయ రహదారి ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరు వద్ద ఆదివారం వివస్త్రగా ఉన్న ఓ మహిళ మృతదేహం కనిపించడం తీవ్ర సంచలనం సృష్టించింది. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళను చిత్రహింసకు గురిచేసి అత్యాచారం చేసి చంపి ఈ ప్రాంతంలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సంఘటనా స్థలంలోని సమీప పరిసరాలు, హోటల్స్‌లో ఆరా తీస్తున్నారు. ఆర్. కొత్తూరు శివారు ఎర్రకోనేరు వద్ద మహిళ మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన బెడ్‌షీడ్‌ను పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన మహిళ తుని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వ్యభిచారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. తుని పట్టణంలో దిబ్బలపాలెంలో రాపర్తి అమ్ములు అనే ఆమెతో కలిసి ఉంటుందని ఆ ప్రాంతంలో ఆమెను కుమారిగా పిలుస్తారని తెలిసిందన్నారు. ఈ దారుణానికి పాల్పడిన కారకులను త్వరలోనే పట్టుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి





తుని రూరల్, మే19: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తల్లి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లోను, ఆరుబయట వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. తరలివచ్చిన వాహనాలతో లోవ ప్రాంగణంలో వాహనాల రద్దీ ఏర్పడింది. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.69 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు 897 మంది హాజరు

జేఎన్టీయూకే, మే19: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 30 మంది గైర్హాజరు కాగా 96.76 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 715 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 704 మంది హాజరయ్యారని, 11 మంది పరీక్ష రాయలేదని మొత్తం 98.46 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 336 మంది హాజరయ్యారని 9 మంది గైర్హాజరయ్యారని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు ఆదివారం మధ్యాహ్నం సెషన్‌లో మాత్రమే జరిగాయని ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

'విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి'

ప్రత్తిపాడు, మే 19: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రంథాలయశాఖ అధికారి వి.సన్యాసి కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి సెలవులు దృష్ట్యా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఉద్యమాలతో ముడిపడిన సుందరయ్య జీవితం

- సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, సీనియర్ నేత శేషబాబ్జి
- పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి



కాకినాడలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, మే 19: ఆద్యంతం ఉద్యమాలు, పోరాటాలు, నిరాడంబరతతో ముడిపడిన సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని, నేటితరం సుందరయ్య స్ఫూర్తితో విలువల కోసం నిలబడాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా కచేరీపేటలోని సుందరయ్యభవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. సభలో రాజశేఖర్, శేషబాబ్జి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథిగా సుందరయ్య ప్రసిద్ధి గాంచారన్నారు. భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నాయకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడుసార్లు శాసనసభ్యుడిగా ప్రజావాణి వినిపించారన్నారు. ఈ సందర్భంగా 'తలపెట్టిన ఉన్నంతలో సాయం.. ఉన్నంత వరకు చేద్దాం'.. పిలుపులో భాగంగా కొందరు వారింటిలో ఉపయోగించని బట్టలు, గిన్నెలు, పుస్తకాలు, ఇతర వస్తువులు సుందరయ్యభవన్‌కు అందించారు. వీటిని పరిసరాల్లోని పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలకవెంకటరమణ, కె.నాగజ్యోతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'సుందరయ్య ఆశయబాటలో ముందుకు సాగాలి'

పెద్దాపురం, మే 19: సమసమాజ స్థాపనే ధ్యేయంగా ప్రతీఒక్కరూ సుందరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సుందరయ్య వర్థంతి సభలో ఆయన పాల్గొని ఆదివారం మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి సామాజిక అసమానతలను నిలదీసిన



పెద్దాపురం: సుందరయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



పిఠాపురంలో పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సుందయ్య బాల్య దశలోనే స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. దోపిడీకి తావులేని సమాజ స్థాపనకు కృషిచేశారని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధిగా పార్లమెంట్, శాసనసభలో ఆయన నిర్వహించిన పాత్ర నేటి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు స్ఫూర్తిదాయకమైన గేయాలు ఆలపించారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, బాలం శ్రీను, సిరిపురపు శ్రీనివాస్, సత్తిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'నాయకులు సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి'

పిఠాపురం, మే 19: నేటితరం నాయకులు సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని



ప్రత్తిపాడులో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీపీఎం నాయకులు సూచించారు. సీపీఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పిఠాపురంలోని నండూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, నాగేశ్వరరావు, మణి, సూర్యనారాయణ, మోహనాచార్యులు, గోపాలకృష్ణ, అప్పారావు, చంటి, నేరియ్య, గాంధీ, పద్మావతి, స్టాలిన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో పుచ్చలపల్లి వర్ధంతి

ప్రత్తిపాడు, మే 19: కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ప్రత్తిపాడులో ఘనంగా నివాళులర్పించారు. పుచ్చపల్లి 39వ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం సంత మార్కెట్‌సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ తరం యువతకు కార్మిక వర్గానికి ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి అని కొనియాడారు. చట్టసభలకు సైకిల్‌మీద వెళ్లిన ఆదర్శమూర్తి పుచ్చలపల్లి అని అన్నారు. ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగా జీవించి కమ్యూనిస్టుగానే మరణించారని కార్మిక,పేద ప్రజల ఆశాజ్యోతిగా వెలుగొందారన్నారు. అనంతరం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో నెట్ల శ్రీను, పోచపల్లి రమణ, కొల్లి సతీష్‌కుమార్, అల్లాడి లక్ష్మి, నాని, వై.రవి, వై.లక్ష్మణ్, తాతారావు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళులు

తాళ్లరేవు, మే 19: కమ్యూనిస్టునేత ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు ప్రజాసంఘాలు, కార్మిక నేతలు కొనియాడారు. ఆదివారం తాళ్లరేవులో సుందరయ్య చిత్రపటానికి పూలమాలతో ప్రజాసంఘాల నేతలు నివాళులర్పించారు. సీపీఎం, ప్రజాసంఘాలు, కార్మికనాయకులు పలువురు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల యజమానులు ఈసీ ఆదేశాలను పాటించాలి

- బంకుల ఎదుట నోటీసులు అంటించాలని డీలర్లకు ఆదేశం
- ఆర్డీవో సీతారామారావు



పెద్దాపురం, మే 19 : పెట్రోల్ బంకుల యజమానులు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తప్పక పాటించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు ఆదేశించారు. స్థానిక విలేఖరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బాంబుల (పెట్రోల్ బాటిల్స్)తో దాడులు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్న ఉదంతాలు బయటపడడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారన్నారు. ఈనేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని, బాటిళ్లలో పెట్రోల్ పోయకూడదన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను దిక్కరిస్తే అనంతరం పరిణామాలకు బంకుల యాజమాన్యాలే బాధ్యత వహించాలని, అలాగే వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఖాళీ సీసాల్లో, క్యానుల్లో పెట్రోలు అమ్మబడదు అని బంకుల ఎదుట నోటీసులు అతికించాలని డీలర్లను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే పెట్రోల్ బంకుల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

పెట్రోలు వాహనాలకు మాత్రమే కొట్టాలి

జగ్గంపేట, మే19: పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్‌ను వాహనాల్లో మాత్రమే పోయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విడిగా సీసాల్లో గానీ, డబ్బాల్లో పోయవద్దని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ ప్రదేశాల్లో జరిగిన అల్లర్లను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆకట్టుకున్న సంగీత గాత్ర కచేరీ



సంగీత గాత్ర కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

పోర్టుసిటీ(కాకినాడ), మే 19: ప్రముఖ న్యాయవాది పేపకాయల రామకృష్ణ నిర్వహించిన సంగీత గాత్రకచేరీ ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కాకినాడలోని సూర్యకళామందిరంలో ఆదివారం లక్కరాజు శేషకుమారి సాంస్కృతిక వేదికపై కచేరీ నిర్వహించారు. వయోలిన్‌పై మహేంద్రవాడ నరసింహమూర్తి మృదంగంపై కోటిపల్లి సూరిబాబు, ఘటంపై సరస్వతుల హనుమంతరావు సహకారం అందించారు. తొలుత సరస్వతీదేవి, త్యాగరాజు చిత్రపటాలకు పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సరస్వతి గానసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేవీఎస్ ఆంజనేయమూర్తి, లక్కరాజు టిక్కు, ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, మాజీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఉచిత బాక్సింగ్ కోచింగ్ ప్రారంభం

పిఠాపురం, మే 19: పిఠాపురం పట్టణంలో ఉచిత బాక్సింగ్ కోచింగ్ ప్రారంభమైంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు, చిన్నారులు బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. మే 31వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు.

'హెచ్ఐవీ బాధితులపట్ల ప్రేమ, సంఘీభావం చూపాలి'



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జీజీహెచ్(కాకినాడ), మే 19: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులపట్ల ప్రేమ చూపుతూ వారికి సంఘీభావం తెలియచేయడం ద్వారా వారి జీవిత కాలం పెరుగుతుందని ఎయిడ్స్ నియంత్రణ విభాగ జిల్లా ప్రోగ్రాం మేనేజర్(డీపీఎం) ఆదిలింగం అన్నారు. 41వ అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యంజలి కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.రమేష్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం ఆదిలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు హరీష్ మహిళా మండలి నుంచి నందివర్ధని హాజరై హెచ్ఐవీతో బాధపడుతున్న 50మంది పిల్లలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ప్రతిఏటా మే నెల మూడో ఆదివారం రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 56,716మంది హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. వారిలో 33,384మంది ఏఆర్‌టీ మందులు వాడుతున్నారన్నారు. గత 20ఏళ్లలో హెచ్ఐవీతో 19,365 మంది మృత్యువాత పడ్డారన్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వాడడమే కాకుండా ముఖ్యంగా మానసిక ధైర్యాన్ని కలిగి ఉండాలని, తద్వారా వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్నంతి, డాక్టర్ ఆర్.శిల్ప, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే రైతులకు మేలు

జగ్గంపేట, మే 19: కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడితేనే రైతులకు మేలు జరుగుతుందని బీజేపీ సీనియర్ నేత కందుల వెంకట అచ్యుతరామారావు అభిప్రాయపడ్డారు. వైసీపీ హయాంలో రైతులకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. కేంద్ర ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం తన నిధులుగా చెప్పుకుని పబ్బం గడిపిందని విమర్శించారు. రైతుల కోసం ఆనాడు ప్రధాని వాజ్‌పేయి ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దానికి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనగా నామకరణం చేశారన్నారు. రైతులకు మేలు చేయడం కోసం గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అన్నిరకాల వ్యవసాయ, ఉద్యాన వన పంటలకు ఈ పథకం వర్తించేలా చేస్తున్నారన్నారు. 90శాతం బీమా వాటాను కేంద్రం చెల్లిస్తుందన్నారు. ఇందుల్లో రైతుల వాటా నామమాత్రంగా ఉంటుందన్నారు. రాజపూడి, వెంగయ్యమ్మపురం, గోవిందపురం గ్రామాల్లో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు బీమా వస్తుందన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.30వేలు వస్తుందని, ఈ మొత్తం ఆగస్టులోగా రైతుల ఖాతాల్లో జమఅవుతుందని వివరించారు.

శాంతియుత వాతావరణానికి సహకరించాలి: డీఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మే 19: గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రజలంతా సహకరించాలని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు కోరారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారంరాత్రి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడి ఎన్నికలు అనంతరం వివాదాలు, ఘర్షణలు, గొడవలు జోలికి పోవద్దన్నారు. ఇటువంటి వాటిల్లో ఉంటే పోలీసు కేసులు నమోదవుతాయని, భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారుతుందని హెచ్చరించారు. సమావేశంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది చంద్రబాబు కూటమి ప్రభుత్వమే

- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి



ఆత్మీయ సమావేశంలో నాయకులతో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు

సర్పవరం జంక్షన్, మే 19 : చంద్రబాబుకు అవినీతి మచ్చ అంటించే కుట్రతో ఆయనను అక్రమంగా అరెస్ట్ చేయించి జైల్లో పెట్టించిన దుర్మార్గుడు సీఎం జగన్ అని, పార్టీ క్యాడర్ ఆందోళనలో ఉన్న సమయంలో జైలుకెళ్లి చంద్రబాబును కలిసి సంఘీభావం ప్రకటించి వైసీపీని ఓడించేందుకు జతకట్టిన గొప్ప వ్యక్తి పవన్ కల్యాణ్ అని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం రాత్రి సర్పవరం జంక్షన్ సమీపంలో ఖాళీ స్థలంలో కాకినాడ రూరల్, కరప మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది టీడీపీ,జనసేన కూటమి ప్రభుత్వమని, సీఎంగా చంద్రబాబు ఎన్నిక లాంఛనమేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల శ్రేయస్సు కోసం టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుందన్నారు. రూరల్ టీడీపీకి కంచుకోట అని, పొత్తులో భాగంగా జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ గెలుపు కోసం పార్టీ క్యాడర్ విశేషంగా కృషి చేసిందన్నారు. చంద్రబాబుకు ఇచ్చిన మాట ప్రకారం నానాజీని 20 నుంచి 25 వేల మోజారిటీతో గెలిపిస్తున్నామన్నారు. రాబోయే అయిదేళ్లలో ఇటు పార్టీ తరపున కార్యర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం విశేషంగా శ్రమించిన పిల్లి సత్యనారాయణమూర్తి దంపతులకు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన సముచిత స్థానం కల్పించాలని కాకినాడ రూరల్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దంపతులను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు కూడుపూడి సత్తిబాబు, నాయకులు కర్రి వెంకట్రాజు, బుంగా సింహాద్రి, రాండేవు సీతయ్యదొర, బోళ్ల కృష్ణమోహన్, తాతపూడి రామకృష్ణ, వి.అంజిబాబు, జి వెంకటేశ్వరరావు, ఆర్ నారాయణరావు, టి.మాచరావు, సూకుమార్, చౌదరి, పి.లోవబాబు, పలివెల త్రిమూర్తులు, పి. ఉషారాణి, బొజ్జ భవాని తదితర నాయకులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

కాజులూరు, మే19: ధాన్యానికి గిట్టుబాబు ధరకల్పించాలని, క్వింటాకు రూ.4వేలకు ఇవ్వాలి గత రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీలో రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేసినప్పటికీ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కాలం వెళ్లబుచ్చిందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఆయన ఆదివారం కాజులూరు మండలంలో మంజేరు, చేదువాడ, తిప్పరాజుపాలెం, శీల గ్రామాల్లో పర్యటించి రైతులను ధాన్యం ధర, కౌలు రైతుల పరిస్థితి రైతులను అడిగితెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ కింటాకు రూ.2200 మద్దతు ధర ఉన్నప్పటికీ 75 కేజీలకు రూ.1500, క్వింటాకు రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారని రైతులు పిల్లి శ్రీనివాసు, వాసంశెట్టి సత్యనారాయణ అన్నారు. రాజబాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం ఢిల్లీలో చేసిన రైతు ఉద్యమం ఫలితంగా ఇచ్చిన హామీలు అమలు జరగక రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. 2014లో గత ప్రభుత్వం వేసిన మూడు కమిషన్లు ధాన్యానికి రూ.3300 కింటాకు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఇప్పుడున్న బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ సంవత్సరం పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర లేకపోవడంవల్ల రైతులు నష్టాలబారిన పడుతున్నారు. ప్రభుత్వంమే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు చేర్చడానికి సంబంధించిన ఖర్చులన్నీ ప్రభుత్వం భరించాలని, వీటిపై ప్రభుత్వం శ్రద్ధ వహించి కౌలు రైతులకు, రైతాంగానికి మేలు చేయాలన్నారు.

నూకాలమ్మ జాతరకు భక్తుల రద్దీ

పెద్దాపురం, మే 19 : భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఆలయకమిటీ సభ్యులు, ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సుమారు ఎనిమిదివేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట, మే 19: ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే ముందుగా భీమేశ్వర స్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు, అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై పురవీధులలో ఊరేగించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

గండేపల్లి, మే19: గండేపల్లి గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. నేమాల అప్పారావు, రాఘవ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మంగళవాయిద్యాలు మోగుతుండగా స్వామివారు అమ్మవారి మెడలో మంగళసూత్రధారణ చేశారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి రంగురంగు పూలతో అలంకరించి వేదికపైన ఆసీనులుచేసి పుణ్యాహవచనం, కంకణధారణ, రక్షాబంధన్, పాదప్రక్షాళన, జీలకర్ర బెల్లం వంటి కల్యాణతంతు నడిపించారు. భక్తులు గోవిందనామస్మరణ మధ్య వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం తలంబ్రాలు ఘట్టం నిర్వహించారు.

ఘనంగా కేశవస్వామి కల్యాణం

తాళ్లరేవు, మే 19: శ్రీకేశవస్వామి వారి కల్యాణం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీపెద్దింటి శ్రీవెంకట శ్రావణకుమారాచార్యులు వారిచే వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం కేశవస్వామివారి కల్యాణం వైభవంగా ఆదివారం రాత్రి జరిగింది. శ్రీస్వామి, అమ్మవార్లకు ఉషకాల ప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో భారీ వర్షం

- అకాల వర్షంతో అన్నదాతల కలవరం

సామర్లకోట, మే 19: ఆరుగాలం కష్టించి పంటలు పండించిన రైతులకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. పంట చేతికొచ్చి అమ్ముకుందామ నుకుంటున్న తరుణంలో అకాలవర్షాలు రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించే ఒదుకు తీసుకెళుతున్న రైతులకు నిత్యం కష్టాలు తప్పడంలేదు. నాలుగైదు రోజులుగా అడపాతడపా వానల నుంచి ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునే ఒదుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రతీరోజూ ధాన్యం ఆరబోస్తూ, సాయంత్రం కాగానే తడవకుండా కుప్పలు కట్టి బరకాలను కప్పుతూ ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. సామర్లకోట పట్టణం, మండలం పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. డ్రైన్లు పొంగి ప్రవహించడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధంగా మారాయి. పట్టణ పరిధిలో డ్రైన్లపై ఆక్రమణలను తొలగించక పోడంతో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా పట్టణంలో పలు ప్రాంతాలకు ముంపు బెడద తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. కాగా గత కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కబోత వాతావరణంతో సతమతమవుతున్న ప్రజానీకానికి ఎడతెరిపిలేని వర్షాలతో చల్లదనం చేకూరి కాసింత ఉపశమనం పొందారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, మే19:ప్రత్తిపాడులో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగ మండటంతో ఉష్ణతాపానికి అల్లాడిన ప్రజలు ఈ వర్షం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది.



ప్రత్తిపాడులో వర్షం కురుస్తున్న దృశ్యం

తొలకరి జల్లులతో రైతుల్లో ఆనందం

గండేపల్లి, మే19: గత ఐదురోజులుగా అడపాదడపా వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనులు ప్రారంభించుకోవచ్చని రైతుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే బోరు నీరు ఆధారమున్న చోటల్లా వర్షం కూడా సాయం చేయడంతో రైతులు ఖరీఫ్ నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పాటుగా ఏప్రిల్ నెలలో ఎండలు విపరీతంగా కాయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. మే నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయని భయాందోళన చెందినప్పటికీ కాలం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

పిఠాపురం, గొల్లప్రోలుల్లో స్వల్ప వర్షం

పిఠాపురం/గొల్లప్రోలు, మే 19: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ఆదివారం సాయంత్రం స్వల్ప వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉంది. ఆకాశంలో మబ్బులు ఉన్నప్పటికీ ఎండకాయడంతో ప్రజలు గ్రీష్మతాపానికి గురయ్యారు. ఉదయం 11గంటలు నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రానికి వాతావరణం మారింది. స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో వాతావరణంచల్లబడి ప్రజలు సేదతీరారు.